# వీర స్వర్గం !



= రచన . శ్రీ. అడపా చిదానంద్ శ్రీ. =

ఆకాశం మేఘావృతమై వుంది. అతి భయంకర కాళ రాత్రి ప్రళయ నృత్యం చేస్తోంది. ఝుంఝూ మారుతాల తాకిడికి వృక్షాలు ఊగిసలాడుతున్నాయి! కర్ణ కఠోరములయిన ఉరుములు... వాటికి ముందరే 'ఝిగేల్' మనే మెఱుపులు! దూరంగా ఎక్కడో వినీ వినబడనట్లు ఏవో అరుపులు!!

రాజాంతఃపురంలో తాణా గెండు గంటలు కొట్టి ఊరుకుంది. రెండు బలమైన ఇనుప వస్తువులేవో గుండెపై కొదినట్లనిపించింది... తల్పముపై పరుండిన 'మురయ'కి బరువుగా నిట్టూర్చాడు. హాయిని గొలిపే ఆ హంస తూలికాతల్పం అతనికే మాత్రం సుఖాన్ని ప్రసాదించలేక పోతోంది. దొర్లుతున్నాడు.

అర్థం కాని మనోవేదన! వెన్నాడే పీడకలలు!! వికలమయిన మనసు!!!—తన ముందే తన తండ్రిని—ఎవరో దుండగులు చిత్రహింస చేస్తున్నట్లూ—తండ్రి బాధ-కన్నీరు!—అదీ అతని పీడకల! గాయమైంది. హృదయ కుమారం! రెండే రోజుల క్రితం జరిగిందో సంఘటన!- అతని ఆలోచనా సముద్రంలో ఓ తెప్పలా సాగిపోతోంది. ఆలోచిస్తున్నాడు...

× × ×

...ఆంగ్లేయులు భారత మాతను దాస్యశృంఖలాలతో బంధించారు. అది సహించలేని ఆమె పుత్రులు విడిపించటానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఝాన్సీ లక్ష్మీ భాయి వీర శౌర్యంతో విజృంభించింది!...

...దెబ్బ తిన్న నాగిని అయింది. "సిపాయిల కలహం" రేకెత్తింది. అదే 1857 ! ఇక ముందు చరిత్రలో చెప్పుకుంటారు. స్వదేశీ రాజుల సహాయం కోరింది మహారాజ్ఞి! పిరికి కండలు గల ఆ వీరాధి వీరులు తెల్లవారికి భయపడ్డారు. కోరమీసాలున్నాయి ఎందుకు? శౌర్యమునకు కాదవి! అందానికి! లక్ష్మీభాయి వెనుకంజ వేయలేదు! స్త్రీ 'అబల' కాదు 'సబల' అని ఋజువు చేసింది. సమర రంగాన దూకింది.

...ఝాన్సీలక్ష్మికి నమ్మిన సేనాని తన తండ్రి "జోద్!" ఆమెతోపాటు ఆయనా వెళ్ళారు రంగంలోనికి! తలుపు దగ్గరే ఆగిపోయాడు. లోపల మాటలు "అబ్బ! జిజియా! బాధ భరించలేను... జిజియా! ఆ ఇంగ్లీషు వాళ్ళు దొంగపాటున పొడిచిన పోట్లు కళ్ళ చెదుతున్నాయి! ఇలాంటి దేహాలు యింకెన్ని ఆ మాయా ప్రచ్ఛన్న రాక్షసుల చేతిలో ఆక్రందిస్తున్నవో! నా రాజమాత ఝాన్సీ యుద్ధభూమిలో ఏలా వుందో... తక్షణం వెళ్ళాలి నేను... ఏదీ... నా 'కళ్యాణి' దగ్గరకు తీసుకుపో 'జిజియా!' తీసుకుపో!" కంఠం రుద్ధమైందాయనకు!

...ఆయనకు దెబ్బలు తగిలాయి! తల్లి జిజియా... కట్లు కట్టింది. తను చూశాడు. ఏదో అనుమానం వచ్చింది! కోపమూ వచ్చింది!!

...తండ్రికి దగ్గరగా వెళ్ళాడు తను! తనే అన్నాడు "ఎంత పని చేశారు నాన్నా! ప్రాణం పోయినా రణరంగం నుండి రాకూడదని మీరే అనేవారు. కాని నీచమైన ఈ గాయాలకే వెఱచి... పారిపోయి వచ్చారా? పవిత్ర భారత మాతకు చరిత్రలో మీవల్ల కళంకం రాదా? మాట్లాడరేం—నాన్నా?" ఆవేశం కట్టలు త్రెంచుకుంది తనకు!

"మురయా!" ఉన్మాదిని ఘర్జన!

"అవును నీ వాగ్ధోరణి! ప్రాణాలకు తెగించి శ్రీ ఝాన్సీ ప్రక్క...వీరోత్సాహంతో యుద్ధం చేశారు. గాయాలు తగిలాయి. దుస్థితి ఎరిగిన మన కళ్యాణి... ఆయనను ఇంటికి తీసుకొచ్చేసింది!" అంది జిజియ!

తను మంత్ర ముగ్ధుడిలా నిల్చున్నాడు.

విచారగ్రస్తమైన కంఠస్వరంతో నాన్న గారిలా అన్నారు. "నిజమే నాయనా! మనిషికి ఒకే సారి వస్తుంది మరణం...దాన్ని మనం వీరమరణంగా రూపొందించాలి. నీ సోదర మానవులకు చేయగలిగినంత సహాయం చేస్తూ వుండు. 'మానవ సేవయే మాధవ సేవ' 'బాబూ! ఇప్పుడు నీదేశం పరాయిచేతుల్లో తల్లడిల్లి పోతోంది. వారి కుతంత్రాలను ఎదుర్కోలేక పోతున్నాం! నీదింకా లేత వయసు...వారి జోలికి పోవద్దు. నీవు పెద్దయినాక, శౌర్య వీర విక్రమ పరాక్రమశక్తితో ఎదిరించువారిని. భారతీయులకు స్వేచ్ఛావాయువులను ప్రసాదించు...నాకు...తెలుసు నా బాబు...ధైర్యశాలి పౌరుషవంతుడు...జిజియా...వస్తాను...అదిగో ... నా తాతగారు ... పిలుస్తున్నారు ... రథం ... ...చ్చి...ం...ది...!

"ప్రభూ!" కుప్ప కూలింది అమ్మ!

"నాన్నా" ఉన్మత్తుడిలా అరచాడు తను!! నాన్న జోడ్ మరి యిక లేదు...హృదయంలో తప్పు! ఎలా వచ్చిన రోజు అలానే వెళ్ళి పోయింది!

...ఆ దినం సాయంత్రం తను అన్నాడు.



అమ్మతో! ''అమ్మా! మా నాన్ననూ...ఈ భారత సోదరులనూ పొట్టన పెట్టుకున్న ఆ కిరాతకులను నా కరవాలమునకు బలి చేసి...ఆ రక్తం కళ్ల జూస్తాను. భారతీయులు బానిసలు కారని ఆ తెల్ల నక్కలకు తెలియజేస్తానమ్మా! నన్ను దీవించి పంపించమ్మా''—అమ్మ ససేమిరా ఒప్పుకుంది కాదు. బుజగిస్తూ అంది... ''నాయనా...నీది మామిడి పిందెలాంటి చిఱుప్రాయం ప్రళయ ఝంఝూమారుతాల తాకిడికి పిందెలు తట్టుకోలేనట్లుగా...ఈ భీకర పోరాటానికి అగలేవు. శీఘ్ర ప్రవాహానికెదురీదడమెలాంటిదో నీకిది అలాంటిది. యుద్ధమంటే చెట్టపట్టాల ఆట కాదు. నువ్వు పెద్దవాడివి అయినాక చూద్దాంలే!'' అంది అమ్మ.

తను మరేం మాట్లాడలేదు. చీకటి పడింది. తల్పంపై పరున్నాడు...''అమ్మ అలా అంటుందేం? నేను పెద్దవాడినయిన దాకా...మా నాన్నను చంపిన వాడుంటాడా ఏమిటి''...ఠాణాలో మరి మూడు గంటలు కొట్టారు.

ఉలిక్కి పడ్డాడు మురయ! ఎదురుగా గోడకు తైలవర్ణ చిత్రాలున్నాయి! ఝాన్సీరాణీ ... తాంతియాతోపే...పీష్వారావ్... నానాసాహెబ్ ... చిరునవ్వులు చిందిస్తున్నారు. ఏదో వింత ఆకర్షణ వుంది ఆ నవ్వుల్లో!

తను సుఖంగా పండుకోలేక పోయాడు. ఆదేశాపూరితుడయాడు. 'కంఠీరవం' లా లేచాడు. ముఖం నుండి 'క్షాత్ర తేజస్సు' ప్రజ్వరిల్లుతోంది!

వక్షస్థలానికి ఉక్కు కవచం ధరించాడు. ఒక చేతితో డాలు...ఒక చేతితో కత్తి తీశాడు. తల్లి జిజియాకి ప్రణమిల్లాడు...ఆమె ప్రశాంతంగా నిద్ర పోతోంది!

గుఱ్ఱపు శాల వైపు నడిచాడు వడి వడిగా! చిన్ని సకిలింపులో పంచకళ్యాణ పలకరించింది. చిఱునవ్వుతో ఒళ్లు నిమిరి, అధిష్టించాడు మురయ! ఆ కాఱు చీకటిలో పంచకళ్యాణి పరుగు లంఘించింది! ఆ ఝంఝూమారుతం...ఆ పంచకళ్యాణికి పాదాక్రాంతమైంది! కళ్యాణికి తన గమ్యం తెలుసు!

పౌర్ణమినాటి సముద్రుడిలా, వీర క్రౌర్యం తో ఉప్పొంగి పోతున్నాడు మురయ! గట్లు, చెట్లు, పుట్టలు, గుళ్లూ...గోపురాలూ...భవంతులూ...వెనక్కి వెళ్ళాయి!

కాస్త తెల్లవారింది. పశ్చిమాద్రిని ఆకాశం ఎఱ్ఱగా వుంది! సృష్టి వైచిత్ర్యమే అది! తూర్పున భానోదయం! పశ్చిమాద్రిని అరుణిమకాంతి! కళ్యాణి పరుగెత్తుతోంది!

అది ఓ అందమైన సరోవరం...ఆ గట్టుమీద ఓ ఆజాను బాహురాలయిన గంభీరమూర్తి! స్త్రీ మూర్తి! ఆమె చుట్టూ ఇరవైమంది అనుచరులున్నారు! ఆమె ఏదో ఆలోచనలో వున్నట్లు...ఆమె నత నేత్రయుగళం ఋజువు చేస్తోంది! ఆమె ముఖం...నక్షత్ర—ఖచిత—పూర్వ దిశాప్రాంతమందు...నవోదితుండగు అరుణునివలె దగద్ధగాయమానమై వుంది! ఆమె...ఝాన్సీలక్ష్మీభాయి!

గుఱ్ఱపు డెక్కల చప్పుడు విని అటు చూశారు. బాలసూర్యునిలా ... సత్రాజిత్తుని శ్యమంతకమణిలా ప్రకాశిస్తున్న ఆ నూనూగు మీసముల ''మురియా'' గుఱ్ఱం దిగి మహారాజ్ఞికి ప్రణతులిచ్చాడు.

తానెవరో తెలిపాడు! జిజియా భర్త...ఝాన్సీని నమ్మిన సేనా నాయకుడు...జోద్ మరణానికి వారెంతో బాధపడి...సంతాపం వెలిబుచ్చారు. ఆ వీర బాలుడు...మురయామొక్క అభిప్రాయం విని ఝాన్సీరాణీ ఎంతో సంతోషించి ప్రేమతో ఇలా అంది. ''నాయనా మురయా!! యుద్ధంలో చాల సైన్యం నష్టమైంది. ఉన్న కాస్త సేనతోనే...ఆఖరి శ్వాస వున్నంతవరకూ మేం పోరాడుతాం! మేం చేయగల్గిందేమీ కాదు. నీవు చాల చిన్నవాడివి. ఇప్పటినుండి యింత పౌరుషం...దేశభక్తి వున్న నీవు...ఆ ''జోద్'' నే మరపించిన సాహసవంతుడివవాలని ఆశీర్వదిస్తున్నాను.

''...ఇక ఇంటికి వెళ్ళు నాయనా! అమ్మ నీ కోసం వెదుకుతుంది. వెళ్లమ్మా...వెళ్ళి...ఆమెన్ను ఓదార్చు.'' అంటూ లేచిందామె. పరివారమంతా లేచింది. మురయ ఏదో చెప్పబోయాడు.

నైరాస్యంగా నవ్విందామె!

వారి అశ్వాలు కొదమ సింగాల్లా ముందుకు ఉరికినై! కాసేపటికి మురయ పంచకళ్యాణి...ఆ రాజాశ్వాలలో ఒకటై దౌడు తీసింది.

అది సమర రంగం! వీరోత్సాహపుటరపులు మిన్ను ముట్టున్నాయి! కరకరాలవములు కఱకులుగా

న్నాయి! ధూళి రేగుతోంది! మర ఫిరంగులు మార్మ్రోగుతున్నాయి! మృత్యువాత పడ్డవారు చావు కేకలు పెడుతున్నారు. రక్తోష్ణధారలు చిమ్ముతున్నాయి! లెక్కకు మిక్కుటంగా వున్నారు, శత్రుసైనికులు. 'మురయ' ఆ రణరంగానికి భయపడలేదు... సరికదా ఉద్రేకం వెల్లుభికింది!

ఆకలిగొన్న మదపుటేనుగులా... పిచ్చి ఎత్తిన సింగపు పిల్లలా స్వైర విహారం సల్పుతున్నాడు. ఝాన్సీ రాణీ ఆ బాల భాస్కరుని చూచి మిక్కిలి అబ్బుర పడింది. శత్రుసైన్యాలు వాడిలి పోతున్నాయి!

లక్ష్మిభాయి... మహిషాసుర మర్దనిలా ప్రళయ నృత్యం చేస్తోంది.

మురయ... త్రిధామ పరాక్రమ విక్రముడైన అర్జునిలా... పంచకళ్యాణిపై వంచకుల పాలిట యముడయ్యాడు.

వారి ధాటికి తాళలేని శిరస్సులు పండుటాకుల్లా రాలి పోతున్నాయి. రక్తవర్షం కురుస్తోంది!!

''నాన్యత్పశ్యతిః నాన్యత్ శ్రవణోతిః నాశుద్ర సముయంతిః తేన ఏష పూరః రసోపైసః —''... అన్నట్లు ఆ స్వైర విహారపు ఆనందస్థాయిలో... ఆ ఇరువురికి శత్రువుల పీకలు తప్ప వేరేమీ కంటికి కన్పించలేదు. మరొకటి వినిపించటం లేదు. ఇంకొకటేదీ వారి చేతులకు రుచింప లేదు.

బలమైన గాయాలు మాత్రం తగులుతున్నాయి! నవ నవలాడే యవ్వనవతి ఝాన్సీ... వికృతంగా తయారయింది! పాపం ఆమె కుడి కన్ను గ్రుడ్డు... పైకి వచ్చేసింది. వికృతం కాక మరేమిటి??

భావి పరాజయపు నైరాశ్యగీతము మాత్రం ఆమె వీనుల, గానం చేస్తోంది. అయినా జంకలేదు వీరనారి.

వక్షస్థలంపై మరొక ఘాతము! కవోష్ణ ధార ప్రవహిస్తోంది! ఎన్ని దెబ్బలుతగిలాయి. ఆ అబలను హతమార్చడాని కెంత మంది భలశాలురు! అయినా ఆమె శత్రువులకు చిక్కలేదు.

ఆ రాజాశ్వం... దుర్మార్గులను తీసుకుపోయింది... ఆ రాత్రే... ఆమె... ఆ... అబల... ఆ... అనన్య సామాన్య ధైర్య... శౌర్య... వీర... విక్రమ ..పరాక్రమ... భారత సామ్రాజ్య లక్ష్మి... ఝాన్సీ లక్ష్మీబాయి... పుష్పగుచ్ఛముగా మారి... భారత మాత కంఠసీమను అలంకరించింది.

ఎప్పుడయితే ఝాన్సీకి వక్షస్థలంలో పోటు తగిలిందో... అప్పుడే ఎవరో మురయను వెనుకపాటుగా పొడిచారు. అప్పటికే ఆ మానవ మాతృడిలో అశక్తి అవరించింది. ఆ పొడిచినపోటు... కవచాన్ని చీల్చుకుని... లోనికి దిగబడింది! బాధతో కూలిగాడు మురయ. కాని చావలేదు. పొడిచినవాడో జనరల్ కెప్టెన్!

పంచకళ్యాణి ఓ ప్రక్కకు పరిగెత్తింది! ''పిరికి శలభమా! ముందుకు రాలేక... వెనుక నిల్చి ..హతమారుస్తావా? అయినా... నీ చేతిలో నా నాజాతి చావదురా... పీల జంబుకమా!'' అంటూ కవచం తీసి... తన కత్తితోనే పొడుచుకుని వీర మరణం... వీరస్వర్గం అలంకరించాడు. పుష్పక విమానం వచ్చింది. అందులో ఆసీను డయాడు.

అంతలో ఆ ప్రదేశానికో ఉన్మాదిని ప్రళయకాల రుద్రకాళిలా వచ్చింది. కరవాలం ఝుళిపించింది. ''నా కొడుకును చంపుతావా? నా భారత మాతను భందిస్తావా? దుర్మార్గుడా! చేతనైతే రా.. రుచి చూద్దువు గాని..''

అంటూ జిజియా వచ్చింది. మరు నిముషానికి జనరల్ కెప్టెన్ తల ఎగిరి పడింది! మరో పది తలలు ఒరిగి పోయాయి!

...ఆమె కరవాలంతో తనను పొడుచుకుంది!—వీర నారి నేల కొరిగింది! పుష్పకవిమానంలో కూర్చున్న మురయ తల్లిని... చేయూత నిచ్చి ఎక్కించాడు, అది వీర 'స్వర్గం' వైపు దూసుకు పోతోంది!

ఓం తత్ సత్.

